క్లుప్తంగా

ఘనంగా బోనాల పండుగ


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

గరిడేపల్లి : మండల కేంద్రంలో బోనాల పండుగను గ్రామస్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలు వండి డప్పు చప్పుళ్లతో ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులపై అవగాహన


కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న బచ్చు సైదయ్య

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామంలో కల్మలచెరువు అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులపై మహిళలు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జైళ్ల శాఖ మాజీ ఐజీ సలహాదారు బచ్చు సైదయ్య ముఖ్య అతిథిగా హాజరై జిల్లాలో పండించే పంటలలో అధిక దిగుబడి ఇచ్చే వాటిపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాలు, ఆహార ఉత్పత్తులను వివరించారు. అనంతరం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా 50 మంది రైతులు, మహిళలకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్, కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి, అగ్రికల్చర్ ఆఫీసర్ డి.నరేష్, కమిటీ అధ్యక్షుడు బచ్చలకూరి నాగయ్య, మహిళా కమిటీ అధ్యక్షురాలు అనంత్ ప్రమీల, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు వద్ద వింత చేప లభ్యం


లభ్యమైన వింత చేప

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టు వెనుక జలాల్లో వింత చేప లభ్యమైంది. సోమవారం చింతలపాలెంకు చెందిన నెమ్మోజు రామాచారి పులిచింతల ప్రాజెక్టు చూసేందుకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో అతనికి ప్రాజెక్టు వెనక జలాలు గల రోడ్డు పక్కన ఉన్న ఒక వాగు వద్ద చేప రోడ్డు మీద పడి ఉండటం గమనించి దానికి ఇంటికి తీసుకెళ్లి మత్స్యకారులకు చూపించాడు. కాగా, దీనిని సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్‌గా, దయ్యం చేపగా పిలుస్తారని, మన ప్రాంతంలో ఇది అరుదుగా లభిస్తుందని వారు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం అందేలా కృషిచేస్తాం

హుజూర్‌నగర్‌రూరల్ : వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించిందని పీసీసీ కార్యవర్గ సభ్యులు ఈడ్పుగంటి సుబ్బారావు అన్నారు. మండలంలోని బూరుగడ్డ, గోపాలపురంలో వరద ఉధృతికి తెగిన నల్లచెరువు, మోదుగులగుంట చెరువులను సోమవారం మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నష్టాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్ట పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. వారి వెంట ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


రోడ్డుపై బురద మట్టిని తొలగిస్తున్న జేసీబీ

మఠంపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురదమట్టిని సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. పనులను ఎంపీడీఓ హరిసింగ్ పర్యవేక్షించి మాట్లాడారు. పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరా, పైపు లైన్ల మరమ్మతులు ముమ్మరం చేయాలని ప్రత్యేక అధికారులను, కార్యదర్శులను ఆదేశించామన్నారు. కార్యదర్శి విజయ, జేపీ మట్టయ్య, బిల్ కలెక్టర్ అన్వర్, సిబ్బంది ఉన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : వర్షానికి మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో పలువురి ఇళ్లలోకి నీరు చేరింది. వీధులు జలమయమయ్యాయి. ప్రస్తుతం నీరు తగ్గడంతో సోమవారం సంబంధిత అధికారులు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. వీధులు, ఇళ్లలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

వరదలతో ముంచి.. నష్టం మిగిల్చి

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని అంతరగంగా నీటి ఉధృతికి కాకవికలమైన తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు సోమవారం కూడా తేరుకోలేదు. ఆ రెండు గ్రామాలు 70శాతం నీటిలో మునగడంతో ప్రజలు నిత్యవసరవస్తువులతో పాటు పంట పొలాలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. తొగర్రాయి, కూచిపూడి, గణపవరం, చిమిర్యాల, నల్లబండగూడెంతో పాటు పలు గ్రామాల్లో దాదాపుగా 2వేల ఎకరాల పంట పొలాలు నీటిమునిగినట్లు అధికారులు అంచనా వేశారు. తొగర్రాయి, కూచిపూడి, గణపవరంలో దాదాపుగా వెయ్యికి పైగావ్యవసాయ మోటార్లు, 100కు పైగా ట్రాన్స్ ఫార్మర్లు నీటిలో కొట్టుకపోయినట్లు రైతులు తెలిపారు.

తొగర్రాయి, కూచిపూడిని సందర్శించిన ఎమ్మెల్యే పద్మావతి..

మండలంలో భారీ వర్షందాటికి తీవ్రంగా నష్టపోయిన తొగర్రాయి, కూచిపూడి గ్రామాలను సోమవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సందర్శించారు. ఇళ్ల, పంట పొలాలు దెబ్బతిన్న బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుండి తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.

350 ఎకరాల్లో ఇసుక మేటలు

గరిడేపల్లి : మూడు రోజులుగా కురిసిన వర్షానికి వచ్చిన వరదలతో మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల కింద వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో పొనుగోడు, కాచవారిగూడెం, కీతవారిగూడెం, గరిడేపల్లి, గానుగబండ, సర్వారం, తాళ్ల మల్కాపురం, అబ్బిరెడ్డిగూడెం, కొత్తగూడెంతో పాటు పలు గ్రామాల్లో పొలాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు అపార నష్టం జరిగింది. సుమారు 350కి పైగా ఎకరాల పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు అధికారులు తెలిపారు. కాచవారిగూడెంలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి, చెరువు కట్ట దెబ్బతిన్నాయి. వెలిదండ సమీపంలో సాగర్ ప్రధాన ఎడమ కాలువ ఇరువైపులా లైనింగ్ లేని చోట కోతకు గురై పాక్షికంగా దెబ్బతిన్నది.

రోడ్లు ధ్వంసమై నిలిచిన రాకపోకలు

మఠంపల్లి : మండలంలో కురిసిన భారీ వర్షానికి అపార నష్టం జరిగింది. చెన్నాయిపాలెం- అలింగాపురంల మధ్య రోడ్డు తెగిపోయి మఠంపల్లి, పాలకవీడు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. హనుమంతులగూడెం - యాతవాకిళ్ల మధ్య గల వంతెనపై వరదకు కొట్టుకొచ్చిన చెట్లు అడ్డంగా చేరడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. బక్కమంతులగూడెం ఊరచెరువు కట్ట పూర్తిగా కోతకు గురైంది. రఘునాథపాలెం వద్ద వరదలతో పత్తిచేలు నీటమునిగి పూత, కాయలు రాలిపోవడంతో రైతులు, కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కిందితండా నుంచి మంచ్యాతండా వెళ్లే రోడ్డు కొట్టుకుపోవడంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా సుమారు 50 విద్యుత్ స్తంభాలు కూలిపోగా పలు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. మఠంపల్లి, చౌటపల్లిలో గండి పడిన చెరువులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మేళ్లచెరువు : కందిబండ సమీపంలో పొలంలో మేట వేసిన ఇసుక, రాళ్లు


మఠంపల్లి : రఘునాథపాలెం వద్ద దెబ్బతిన్న పత్తి చేను

భారీ వర్షానికి అపార నష్టం

నడిగూడెం : మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు అపార నష్టం మిగిలింది. మండలంలో అన్ని చెరువులు అలుగు పోస్తుండడం, నడిగూడెం, చాకిరాల, రత్నవరం గ్రామాల మీదుగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దాదాపు 200 ఎకరాలకు పైగా వరి పొలాలు నీటి మునిగాయి. పలువురి పొలాల్లో ఇసుక మేట వేశాయి. నడిగూడెం నుంచి చాకిరాలకు వెళ్లే రహదారి పలు చోట్ల కుంగింది. రత్నవరం వద్ద కల్వర్టు దెబ్బతిన్నది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన 558 ఎకరాలు

మునగాల : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన 558 ఎకరాల వరిపైరు నీట మునగినట్లు తమ ప్రాథమిక సర్వేలో తేలిందని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు తెలిపారు. సోమవారం తమ సిబ్బందితో కలిసి గ్రామాలలో పర్యటించి నీట మునిగిన వరిపైర్లను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓలు మేడిశెట్టి వృషశ్రీ, మాచర్ల రమ్యతేజ, చిక్కుల భవాని, బాణోతు నాగు పాల్గొన్నారు.

చెరువుల కట్టలు తెగి.. రాకపోకలు నిలిచి

చిలుకూరు : భారీ వర్షానికి వచ్చిన వరదలతో రోడ్లు తెగిపోయి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపురం ఊర చెరువు నాలుగు చోట్ల గండి పడడంతో నీళ్లు ఉధృతంగా ప్రవహించి నారాయణపురం నుంచి సీత్లాతండా మీదుగా వెళ్లే రోడ్డు తెగిపోయింది. గ్రామ శివారు వద్ద ఒక చోట, సీత్లాతండా నుంచి నారాయణపురం వస్తుండగా అలుగు వద్ద పెద్ద మొత్తంలో రోడ్డు తెగింది. దీంతో ఈ గ్రామం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. బేతవోలు వీర్లదేవి చెరువు ఉధృతంగా ప్రవహించి రోడ్డు మీదకు నీళ్లు వస్తుండడంతో బేతవోలు నుంచి చిలుకూరు, కోదాడకు రాకపోకలు నిలిచిపోయాయి.


వరదలకు తెగిన నారాయణపురం - సీత్లాతండా రోడ్డు

దొండపాడు బైపాస్ రోడ్డు ధ్వంసం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వరద ప్రవాహం ఎక్కువై గ్రామ శివారులో వాగు ఉధృతంగా ప్రవహించడంతో దొండపాడు బైపాస్ రోడ్డు దాదాపు 500 మీటర్లు వరకు నామరూపాల్లేకుండా ధ్వంసమైంది. కాగా, పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్న అవుట్‌ఫ్లో నీటిలో వజినేపల్లి, బుగ్గమాదారం శివారులోని నది ఒడ్డున ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. నది ఒడ్డున లోతట్టు ప్రాంతంలో సాగు చేస్తున్న పత్తి, మిర్చి, అరటి పంటలు నీట మునిగాయి.

పీహెచ్‌సీలోకి నీరు.. నిలిచిన వైద్యసేవలు

చిలుకూరు : చిలుకూరు అంతర్గంగ వంతెన వద్ద నీటి ప్రవాహం పెరిగి పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడ కూలి ఆరోగ్య కేంద్రంలోకి నీరు చేరింది. ప్రస్తుతం నీళ్లు బయటికి వెళ్లినప్పటికీ గదులు బురదమయంగా మారడంతో వైద్యసేవలు నిలిపివేశారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్‌లు పరిశీలించారు.

ప్రధాన రహదారిపై కూలిన బ్రిడ్జి

మేళ్లచెరువు : గత రెండు రోజులుగా కురిసిన వానకు జలదిగ్బంధంలో చిక్కుకున్న మండలంలోని పలు గ్రామాలు సోమవారం కొంత మేరకు బయటపడ్డాయి. ఇదిలా ఉండగా కోదాడ- మేళ్లచెరువు ప్రధాన రహదారిపై కందిబండ వద్ద బ్రిడ్జి కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మండల కేంద్రానికి వచ్చే వారు హుజూర్‌నగర్ మీదుగా చేరుకుంటున్నారు. అదేవిధంగా మండలంలోని చెరువులకు గండ్లు పడి పొలాల మీదుగా నీరు ప్రవహించడంతో పంట పొలాల్లో మట్టి, ఇసుక మేట వేసింది.


చిలుకూరు : బురదమయంగా చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


మునగాల : నీటమునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాజు


మేళ్లచెరువు : కందిబండ సమీపంలో ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైన్


చిలుకూరు: అంతర్గంగ వంతెన వద్ద నీటి ఉధృతికి కోతకు గురైన మదేలమ్మ ఆలయ అడుగు భాగం


కోదాడరూరల్ : రామలక్ష్మీపురం శివారులో తెగిన గణపవరం స్టేజీ వద్దకు వెళ్లే రోడ్డు


మఠంపల్లి : హనుమంతులగూడెం- యాతవాకిళ్ల మధ్య వంతెనపై రాకపోకలకు అంతరాయంగా కంపచెట్లు


చిలుకూరు : అర్లెగూడెం వద్ద ఆర్‌కే మేజర్ కాల్వకు గండి పడి వృథాగా పోతున్న నీరు


కోదాడరూరల్ : ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు


మఠంపల్లి : బక్కమంతులగూడెం వద్ద కోతకు గురైన చెరువు కట్ట

కొనసాగుతున్న సహాయక చర్యలు


సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ అధికారుల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని దద్దనాల చెరువు కాలువ, పంటల కాలువ నుంచి వచ్చే నీరు వెళ్లే విధంగా సోమవారం ప్రొక్లయిన్‌తో పూడిక తీయించారు. మురుగు, వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. వరద ప్రవహించిన బజార్‌లలో, గృహాల వద్ద బ్లీచింగ్ చల్లించారు. నీరు నిల్వ ఉన్న గుంతలలో ఆయిల్‌బాల్స్ వేశారు. గోవిందపురం వద్ద రూ.2 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి ప్రాంతాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. తక్షణం తీసుకోవాల్సిన చర్యల గురించి సమీక్షించారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకుబ్‌పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, తహసీల్దార్ నాగేందర్, ఏఈ వినోద్, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజన వసతి


నారాయణపురంలో వరద బాధితులకు భోజనం అందించిన అధికారులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో చెరువు కట్ట తెగడంతో గ్రామంలో సుమారుగా 50 ఇళ్లలోకి నీళ్లు చేరాయి. దీంతో వరద బాధితులకు గ్రామానికి చెందిన పలువురు దాతల సహకారంతో అధికారులు వారికి భోజన వసతి కల్పించారు. తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, సిబ్బంది బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు.

వాహనదారులకు..

కోదాడరూరల్ : రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్ రోడ్ వద్ద పాలేరు వాగుపై వంతెన కోతకు గురికావడంతో పోలీసులు హైదరాబాద్ -విజయవాడ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. దీంతో చిమిర్యాల, నల్లబండగూడెం గ్రామాల వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ఆ వాహనదారులకు కోదాడకు చెందిన 31వ వార్డు కౌన్సిలర్ తిపిరిశెట్టి సుశీలరాజు, స్వర్ణభారతీ ట్రస్ట్, నల్లబండగూడెం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భోజనం ఏర్పాట్లు చేశారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు, హోమం జరిపారు. స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రవేశానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిదంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు , ఈఓ నవీన్ కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నడిగూడెం : వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్టను సోమవారం ఆయన పరిశీలించిన మాట్లాడారు. వరద కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు నష్ట పరిహారం ప్రకటించాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసరెడ్డి, నూకపంగు ఈదయ్య తదితరులు ఉన్నారు.

మునిగిన పంట పొలాల పరిశీలన

అనంతగిరి : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్ల య్యయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మునకకు గురైన గోండ్రియాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు మన్నె కృష్ణవేణి హరీష్, నేలకుర్తి ఉషారాణి, హనుమంతరావు, వీరయ్య, బోసు, వెంకటయ్య, అస్సాం, నవీన్, లచ్చయ్య పాల్గొన్నారు.


కాగితరామచంద్రాపురం వద్ద తెగిన సాగర్ కాల్వ కట్టను పరిశీలిస్తున్న మల్లయ్యయాదవ్

ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలి


మఠంపల్లిలో ఇసుక మేట వేసిన పంట పొలాలను పరిశీలిస్తున్న పల్లె వెంకటరెడ్డి

మఠంపల్లి : భారీ వర్షాలకు నీట మునిగి, ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్టపోయిన పత్తి, వరి రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు యాతవాకిళ్ల, వరదాపురం, చౌటపల్లి, బక్కమంతులగూడెం, చెన్నాయిపాలెం, పెదవీడు, మంచ్యాతండా తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, సీపీఎం, రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు పాండునాయక్, బాలునాయక్, జగన్‌మోహన్‌రెడ్డి, రాము ఉన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి

చిలుకూరు : భారీ వర్షాల ప్రభావంతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. నారాయణపురంలో తెగిన చెరువు కట్టను ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. దెబ్బతిన్న వరి పొలాలకు ఎకరానికి రూ. 25 వేలు, ఇతర పంటలకు రూ.30 వేలు, కూలీన ఇళ్లకు రూ.6 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సీపీఐ జిల్లా నాయకులు మేకల శ్రీనివాస్, లతీఫ్, సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి


మునగాల : ముకుందాపురంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ అభిమానులు


మఠంపల్లిలో పాల్గొన్న అభిమానులు, కాంగ్రెస్ నాయకులు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


చిలుకూరు : బేతవోలులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


కోదాడలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వెంకటరత్నం బాబు, తదితరులు


హుజూర్‌నగర్‌రూరల్ : లక్కవరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు


అనంతగిరి : మొగలాయికోటలో..


గరిడేపల్లి : పొనుగోడులో..